పదికి పకడ్బందీ ఏర్పాట్లు

రేపటి నుంచి ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్న పరీక్షలు

- 896 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 46,834 విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా మొత్తం 231 పరీక్షా కేంద్రాలు
- పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు గాలి, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు
- మంచినీటితో పాటు కనీస వసతి, ప్రథమ చికిత్స శిబిరం
- ఉత్తమ ఫలితాల లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దాం..
- 'సాక్షి'తో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి





సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి తెలిపారు. విద్యార్థులకు బోర్డు పరీక్షలంటే ఎలాంటి భయం లేకుండా రాసేలా సన్నద్ధం చేశామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీటి వసతులతో పాటు కనీస సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. పరీక్షల నేపథ్యంలో 'సాక్షి'కి శనివారం ఇచ్చిన ఇంటర్వ్యూను ఆమె మాటల్లోనే పరిశీలిద్దాం..

- విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక తరగతులు నిర్వహించి, సన్నద్ధం చేశాం. డిసెంబరు వరకు సిలబస్ పూర్తి చేసి తర్వాత ప్రాక్టీసు టెస్టులు, నాలుగు రివిజన్ టెస్టులు నిర్వహించాం. ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాం. వీటి నిర్వహణతో విద్యార్థుల్లో పరీక్షలంటే ఉండే భయం పోయి అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సిద్ధమయ్యారు.
- పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 62 ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలు 834 ఉండగా, మొత్తంగా 46,834 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఇందులో బాలురు 24,034మంది, బాలికలు 22,800 మంది ఉన్నారు. వీరికి 231 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం.
- పదో పరీక్షలు సాఫీగా జరిగేలా జిల్లావ్యాప్తంగా మొత్తం 2,769 మంది సిబ్బందిని నియమించాం. 231 పరీక్షా కేంద్రాల్లో 2,310 మంది ఇన్విజిలేటర్లు, 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక చీఫ్ సూపరింటెండెంట్, 20 మంది కస్టోడియన్లు, మరో 25 మంది అదనపు కస్టోడియన్లు, 8 మంది రూట్ ఆఫీసర్లను నియమించాం.
- విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. అప్పుడే వారు ప్రశాంతంగా ప్రశ్నపత్రాన్ని ఆసాంతం చదివి సమాధానాలు రాస్తారు. పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఆయా కేంద్రాల పరిధిలో బస్సులు సమయానికి నడిపేలా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ సంస్థను కోరాం. కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేసేలా పోలీసు శాఖను కోరాం. పరీక్షలు జరిగినన్ని రోజులు జిరాక్సు కేంద్రాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకున్నాం. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతి లేదు.
- జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలు లేవు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు చేశాం. "పరీక్షా సమయాల్లో కరెంటు సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు పరీక్షా రాసే కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నాం.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసిన ఎలిఫెంట్ ఎన్‌క్లేవ్ కాలనీవాసులు

కీసర: మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని శనివారం గోధుమకుంట గ్రామ మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎలిఫెంట్ ఎన్‌క్లేవ్ ఏ బ్లాక్ కాలనీవాసులు వివిధ సమస్యలను తెలియజేశారు. కాలనీకి నీటి సరఫరా చేసేందుకు జలమండలి ఆధ్వర్యంలో మంచినీటి పైప్‌లైన్ పనులు చేపట్టడంతో పాటు వర్షం నీరు కాలనీలోకి చేరకుండా వరద నీరు వెళ్లేందుకు వీలుగా పైప్‌లైన్ పనులు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగభూషణం, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ పవన్‌కుమార్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యం ఏర్పర్చుకోవాలి



లక్ష్మాపూర్‌లో ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేస్తున్న మల్క యశస్వీ

శామీర్‌పేట్: సమాజ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని డిల్లీ పబ్లిక్ స్కూల్స్ సీఈఓ మల్క యశస్వి అన్నారు. పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ కీలమని, ఇప్పుడే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.

శ్రీనివాస్‌రెడ్డి సేవలు ఎనలేనివి



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ప్రాంత్రానికి దివంగత కాంగ్రెస్ నేత ఎర్రవల్లి శ్రీనివాస్‌రెడ్డి సేవలు ఎనలేనివని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు. మండలంలోని డబిల్‌పూర్ గ్రామానికి చెందిన దివంగత మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి విగ్రహావిష్కరణ శనివారం డబిల్‌పూర్‌లో ఆయన కుమారుడు విఘ్నేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు నిర్వహించగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు ఉద్దమర్రి నర్సింహారెడ్డి పాల్గొని నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్, చాపరాజు, నాయకులు అక్రంపాష, సంజీవరావు, బాల్‌రెడ్డి, సురేందర్, రవి ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, సుర్వీ శ్రీనివాస్‌గౌడ్, పంగ హరిబాబు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో..

దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న భూగర్భ మురుగు కాల్వల నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీతాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్ మాదిరెడ్డి పావనిరెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఎన్నికల నిబంధనలను అమలు చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ నోడల్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లో వివిధ విభాగాల నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికలకు సంబంధించి జిల్లా నోటిఫికేషన్ వచ్చే నెల 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి 25 తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేటు స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, అడ్వర్టయిజ్‌మెంట్స్, కటౌట్స్ తొలగించాలని ఆదేశించారు. 1950 ద్వారా, కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. అలాగే 'సి' విజిల్ యాప్ ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఎంసీసీ టీమ్స్ క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, నోడల్ అధికారులు, ఎన్నికల సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన గస్ ఎడ్యుకేషన్ ఇండియా ఆధ్వర్యంలో జాయ్ ఆఫ్ గివింగ్‌ను నిర్వహించారు. నగరంలోని 'హోమ్ ఫర్ ది డిసేబుల్డ్' కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా సంస్థ ఉద్యోగులు అక్కడి దివ్యాంగుల కోసం వివిధ రకాల వస్తువులను విరాళంగా అందించారు. ఇందులో డైపర్లు, శానిటరీ ప్యాడ్‌లు, కాటన్ బ్యాండేజీలు, డిస్పోజబుల్ సూదులు, ఇన్సులిన్ సూదులు, టీ షర్టులు, చీరలు, షర్టులు, ప్యాంట్లు, స్వెటర్లు, బెడ్‌షీట్లు, దిండు కవర్లు వంటి 301 రకాల వస్తువుల్ని అదనంగా, ఉపరితల క్లీనర్లు, టాయిలెట్ క్లీనర్లు, సీలింగ్ ఫ్యాన్, ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, కుక్కర్‌తో సహా వంటి గృహోపకరణాలు, నిత్యావసర వస్తువుల్ని అందించారు. దివ్యాంగుల అవసరాల్ని గుర్తించి అన్ని రకాల వస్తువుల్ని అందించడంపై ఉద్యోగుల్ని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, శశి జలిగామ అభినందించారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి



పనులకు శంకుస్థాపనలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు ఆయకట్టు కింద ఉన్న చుట్టూ కాల్వ పనులను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు ఎండిపోకుండా ఉండాలని కాల్వ పనులకు ప్రభుత్వం రూ.26.66 లక్షలు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ పరమేశ్, అమర్, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

కంపెనీని మోసం చేసిన వ్యక్తికి జైలు

మేడ్చల్‌రూరల్: కంపెనీని మోసం చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తుల్లో ప్రధాన నిందితుడికి మేడ్చల్ 9 ఏఎంఎం కోర్టు న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. మేడ్చల్ పోలీసులు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివరాల ప్రకారం నగరంలోని చార్మినార్‌లో నివాసం ఉండే ఆయాబ్ మహ్మద్ ఖాన్(27) మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామంలోని వాహనాల విడిభాగాలను తయారు చేసే రాజ్‌దీప్ ఆటోమోటివ్స్ కంపెనీలో 2014లో రిటైల్ ఔట్‌లెట్‌లో ఇన్‌చార్జిగా విధుల్లో చేరాడు. అతడు వినియోగదారులకు విడిభాగాలు(స్పేర్ పార్ట్స్) విక్రయించేవాడు. కంపెనీలో జీఎంగా విధులు నిర్వహిస్తున్న సతీష్ ఒక రోజు కంపెనీలోని ఔట్‌లెట్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేసి స్టాక్‌లో తేడా ఉన్నట్లు గుర్తించాడు. ఈ విషయంపై ఆయాబ్ మహ్మద్‌ఖాన్‌ను అడగ్గా వినియోగదారులకు విడిభాగాలు విక్రయించానని, వారి నుంచి డబ్బులు రావాల్సి ఉందని సమాధానం ఇచ్చాడు. అంతేగాక తన సోదరుడు జునైత్‌ఖాన్ నుంచి రూ.4,67,079 అండర్ టేకింగ్ లెటర్ తీసుకున్నాడు. అలాగే రికార్డులో తనిఖీల్లో భాగంగా రూ.5,68,468 తీసుకొని కంపెనీకి చెల్లించకుండా తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు తేలింది. దీంతో జీఎం సతీష్ 2016 ఏప్రిల్‌లో మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నాటి ఎస్‌ఐ కిశోర్ దర్యాప్తు చేపట్టి ఆయాజ్ మహ్మద్‌ఖాన్ డబ్బుల దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు తుది విచారణకు శనివారం రావడంతో కోర్టు న్యాయమూర్తి డబ్బులను దుర్వినియోగానికి పాల్పడిన ఆయాబ్‌కు ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఘట్‌కేసర్ చైర్ పర్సన్‌కు పదవీ గండం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ పావనీజంగయ్యపై సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదిపారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం లేఖ అందజేశారు. అవిశ్వాసం పెట్టేందుకు కౌన్సిలర్లకు జనవరి నుంచి అవకాశం ఉండటంతో ముందే గమనించిన చైర్ పర్సన్ విహార యాత్రకు వెళదామని నచ్చజెప్పడంతో మిన్నకుండిపోయారు. మెజారిటీ బీఆర్ఎస్ కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతుతో గద్దెదించాలని గతంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. మారుతున్న రాజకీయ పరిణామాల కారణంగా చైర్ పర్సన్ కాంగ్రెస్‌లో చేరతారని ఇటీవల పుకార్లు చక్కర్లు కొట్టడంతో ముందే గద్దెదించాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు కంకణం కట్టుకున్నారు. వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలుపుకొని 12 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం లేఖను కలెక్టర్ సూచనల మేరకు డీఆర్‌ఓ హరిప్రియకు అందజేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు, బీజేపీ నేతలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి 3వ వార్డులోని బ్రాడ్ వే కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలంటూ బీజేపీ నాయకులు, కాలనీవాసులు శనివారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, బీజేపీ నాయకులు జాకట ప్రేమ్‌దాస్, హరిబాబురెడ్డి, ఈశ్వర్, ప్రభు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నైబర్‌హుడ్ కమ్యూనిటీ, యువ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేవ్ వాటర్-సేవ్ లైఫ్ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. నైబర్ హుడ్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు, యువ లయన్స్ క్లబ్ సలహాదారు తులసి, క్లబ్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాసంస్థలను సందర్శించిన నాయకులు



గురుకుల్ జూనియర్ కళాశాల అభివృద్ధిపై చర్చిస్తున్న వజ్రేశ్‌యాదవ్, సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని గురుకుల విద్యాసంస్థలను మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శనివారం సందర్శించారు. మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.5 కోట్లను గురుకుల్ పాఠశాల, జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల విస్తరణ కోసం వినియోగించాలని అన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కార్యక్రమంలో చంద్రారెడ్డి

కీసర: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీకాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని వివిధ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు ఫిర్యాదు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సుతారిగూడ చెరువులోకి డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్ ముదిరాజ్, గ్రామ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్ రాములుకు ఫిర్యాదు చేశారు. చెరువు సమీపంలో ఉన్న సీఎంఆర్ కళాశాలల నుంచి వెలువడే డ్రైనేజీ నీటిని కళాశాల యాజమాన్యం చెరువులోకి వదులుతున్నారని, దీంతో చెరువులోకి డ్రైనేజీ చేరి నీరు కలుషితం అవుతోందని, చేపలు చనిపోతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. నీరు కలుషితం కావడంతో దుర్వాసన వెలువడి ప్రజలు, ప్రయాణికులు అనారోగ్యానికి గురవుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

కంప్యూటర్ కోర్సులకు ఐఐటీఎం విద్యార్థులు



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ఐఐటీఎం డిగ్రీ కళాశాలలో మేడ్చల్ జిల్లా టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో బీఎస్సీ, బీకాం విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులు అందించేందుకు శనివారం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని ఐఐటీఎం కళాశాలలో డిగ్రీ చదువుతున్న ప్రణయ్ యాదవ్, లావణ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్.రవీందర్‌రెడ్డి, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్‌దాస్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ రాధికరెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ ఎంపీఓగా రవినాయక్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల పరిషత్ ఎంపీఓగా రవినాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ గీతారెడ్డి ఆయన ఉద్యోగ బాధ్యత అప్పగించారు. ఇక్కడ ఎంపీఓగా విధులు నిర్వహించిన నందకిశోర్ కీసర మండలానికి బదిలీ కాగా మూడుచింతపల్లి మండల ఎంపీఓ రవినాయక్ బదిలీపై వచ్చారు.

సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్: ఆడపిల్లల ఆర్థిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎదులాబాద్ పంచాయతీ కార్యాలయంలో శనివారం మహిళలతో పోస్టాఫీస్‌లో ఖాతా తెరిపించి పాస్ బుక్కులు అందజేశారు. పోస్టాఫీస్ అధికారులు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి మేడ్చల్ జిల్లా: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధిచెబుతారు..



జవహర్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



ఘట్‌కేసర్‌లో నిరసన చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులు

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ దుర్మార్గపు చర్య

జవహర్‌నగర్: ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం జవహర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గపు చర్యన్నారు. ఉద్యమాల చరిత్ర కలిగిన బీఆర్ఎస్ అక్రమ అరెస్టులకు భయపడదని, న్యాయపోరాటానికి సిద్ధమవుతామన్నారు. కార్పొరేటర్ మేక లలితాయాదవ్, నాయకులు రాజశేఖర్, రెడ్డిశెట్టి మహేష్, జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌చారి, సింగన్న బాలరాజు, సిద్దులుయాదవ్, రమేష్‌చారి, బండకింది ప్రసాద్‌గౌడ్, నర్సింహయాదవ్, కాసీం, నర్సింహులు, పాల్, భాస్కర్, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చౌరస్తాలో..

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో టీఆర్ఎస్ నాయకులు శనివారం నిరసన చేపట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, టీఆర్ఎస్ మున్సిపల్, మండల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, రమేశ్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాంపల్లి చౌరస్తాలో..

కీసర: నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ నేతలు రాంపల్లి చౌరస్తాలో ధర్నాకు దిగారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, నాయకులు గండి అంజయ్యగౌడ్, కౌకుట్ల అనంతరెడ్డి, అన్నంరాజు శ్రీనివాస్, మోకు జగన్మోహన్‌రెడ్డి, నిమ్మలశ్రీనివాస్, సాయినాథ్‌గౌడ్, కొమురెల్లి సుధాకర్‌రెడ్డి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో..

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి, ఈడీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, రాష్ట్ర నాయకులు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, భాగ్యారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకులు విష్ణుచారి, సందీప్‌గౌడ్, బాబు యాదవ్, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగారం మున్సిపల్ రాంపల్లిచౌరస్తా వద్ద ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ నేతల ధర్నా



మేడ్చల్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో, ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు